ఆరోగ్య ఖాతా.. అందరికీ మేలు

- ప్రతి ఒక్కరికీ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్
- ఈ కార్డుతో ఎక్కడైనా వైద్య సేవలు
- రోగి సమగ్ర వివరాల నమోదు
- సత్వర వైద్యానికి అవకాశం


పీహెచ్‌సీలో వైద్యసేవలను అందిస్తున్న వైద్యులు

పామర్రు: అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరితే అన్ని పరీక్షలు చేయటం సాధారణ విషయమే. రోగి ఆరోగ్య పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకుంటే గాని సరైన చికిత్స చేయడానికి సాధ్యపడదు. ఇందుకు డబ్బుతో పాటు సమయం కూడా వృథా అవుతుంది. కానీ ఇక మీదట ఈ పరిస్థితి ఉండదు. రోగికి దేశంలో ఎక్కడైనా సత్వర, నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్(ఆభా) కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి.

పామర్రు నియోజకవర్గంలో..

నియోజకవర్గంలో 2.25 లక్షల జనాభా ఉన్నారు. ఇప్పటి వరకు సుమారు 1.60 లక్షల మందికి కార్డులు జారీ చేశారు. దీంతో ఈ ప్రక్రియ సుమారు 65 శాతం పూర్తయ్యింది. నూరు శాతం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

మండలాలవారీగా..

పామర్రు నియోజకవర్గంలో ఇప్పటికి 1,60,000 కార్డులు జారీ చేశారు. పామర్రు మండలంలో 43,000, తోట్లవల్లూరు మండలలో 21,000, పమిడిముక్కల మండలంలో 36,000, మొవ్వ మండలంలో 32,000, పెదపారుపూడి మండలంలో 28,000 వంతున ఇప్పటి వరకు కార్డులు జారీ చేశారు. మిగిలిన కార్డుల జారీకి చర్యలు ముమ్మరం చేశారు.

కార్డుతో ప్రయోజనాలివీ..

- ప్రతి ఒక్కరికీ నాలుగు నంబర్ల ఐడీ కార్డు ఇస్తారు. ఈ ఐడీ ఆధారంగా ఎక్కడైనా వైద్య సేవలు పొందేందుకు అవకాశం ఉంటుంది. దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడే వ్యక్తి ఇతర రాష్ట్రాల్లోనూ వైద్య సేవలు పొందవచ్చు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందిస్తారు.
- వ్యక్తికి ప్రమాదం జరిగినప్పుడు అతని ఆరోగ్య పరిస్థితి గురించి పూర్తి వివరాలు ఐడీలో నమోదై ఉండటంతో సత్వర వైద్యానికి వీలుంటుంది.
- షుగర్, బీపీ, ఆస్తమా తదితర దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడే వారి వివరాలూ ఐడీలో నిక్షిప్తమై ఉంటాయి. బ్లడ్ గ్రూపింగ్ వివరాలు కూడా ఉండడంతో అవసరమైన రక్తాన్ని అప్పటి కప్పుడేఅందించే వీలుంది.

అందరికీ అకౌంట్‌లు ఇస్తున్నాం..



ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్లను వచ్చిన ప్రతీ రోగికి ఇవ్వడం జరుగుతోంది. వచ్చిన వారికి గతంలోనే నెంబరు ఉంటే దాని ప్రకారం వివరాలను తెలుసుకుని తగు విధంగా వైద్య సేవలను అందిస్తున్నారు. ప్రజలకు ఎంతో ఉపయుక్తమైన అభా ఐడీని ప్రతీ ఒక్కరు కలిగి ఉండాలి.సత్వర వైద్య సేవలు అందేందుకు ఇది ఎంతగానో దోహద పడుతుంది.

–పీ సుధారాణి, వైద్యులు, పీహెచ్‌సీ, పామర్రు

నమోదు ఇలా..

సచివాలయ ఏఎన్‌ఎంలు, ఏఎన్‌ఎంలను సంప్రదిస్తే యాప్‌లో వివరాలునమోదు చేస్తారు. తర్వాత నాలుగు అంకెలతో కూడిన హెల్త్‌కార్డు జారీ అవుతుంది. వ్యక్తిగతంగానూ నమోదు చేసుకోవచ్చు. ఆయుష్మాన్‌భారత్ యాప్‌లో మొబైల్ నంబరు, ఆధార్ కార్డు వివరాలను, వయస్సు, ఎత్తు, బరువు తదితర ఆరోగ్య వివరాలను పూర్తి స్థాయిలో నమోదు చేయడం ద్వారా హెల్త్ ఎకౌంట్ నంబరు పొందవచ్చు.

త్వరలో సర్వజన ఆస్పత్రుల్లో..

త్వరలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలోనూ ఈ సేవలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే కైలే రాక

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మంగళవారం మండలంలోని గరికపర్రు గ్రామానికి విచ్చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. స్థానిక సాయిబాబా కల్యాణ మండపంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ రథసారధుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొనాలని రామ్మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

తోట్లవల్లూరు: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 22న బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తుంగల స్వర్ణలత సోమవారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అధ్యక్షతన జరిగే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

24న వ్యాసరచన పోటీలు

మండవల్లి: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సుధామ ఫౌండేషన్, ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక హైస్కూల్‌లో, మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 8, 9, 10 తరగతుల విద్యార్థులకు 24, 27 తేదీల్లో సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్ కుమార్, ఎల్ఎస్ భాస్కరరావు, టి.అప్పారావు, హెచ్ఎం జి.వెంకటేశ్వరరావు, గ్రంథాయాధికారి షేక్ పర్వీన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24న గ్రామాల అభివృద్ధిలో సైన్స్ ప్రాముఖ్యత, 27న సైన్స్ ఎగ్జిబిషన్ పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు మెమెంటోలు, మెరిట్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకున్న ప్రదర్శనలు

మండవల్లి: ఏలూరులోని కస్తూర్బా బాలికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో కానుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. మూడు ప్రాజెక్ట్‌లను ప్రదర్శించినట్లు సైన్స్ ఉపాధ్యాయుడు కె.శ్యాంప్రసాద్ తెలిపారు. ఈ నెల 21 కూడా ఎగ్జిబిషన్‌లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఎకో ఫ్రెండ్లీ ప్రాజెక్ట్‌లో జి.హేమశ్రీ, టి.దీపిక పాల్గొన్నారని, వీరికి టీచర్ వి.భాగ్యకుమారి తర్ఫీదు ఇచ్చారని తెలిపారు. చంద్రయాన్–3 ప్రాజెక్ట్‌ను జి.ప్రభుకిరణ్, జి.అనిల్ తయారు చేశారని, యాక్సిడెంట్ కంట్రోల్ వెహికల్ అలారం ప్రాజెక్ట్‌ను వి.సంతోష్, సీహెచ్ సంతోష్ రూపొందించారని వివరించారు. వీరికి కె.శ్యాంప్రసాద్ గైడెన్స్ టీచర్‌గా వ్యవహరించారని తెలిపారు. ఆరోగ్యం–శక్తి అన్న అంశంలో మండవల్లి హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నట్లు శ్యాంప్రసాద్ పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలి

ముదినేపల్లి రూరల్: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు సత్వరమే పూర్తిచేయాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గురజ, కొరగుంటపాలెం జగనన్న కాలనీల్లో సోమవారం ఆమె పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రతి పేదవాడి సొంతింటికల నెరవేరాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థలాలు, ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు. ఉగాది పండుగ నాటికి నిర్మాణాలు పూర్తిచేసి గృహ ప్రవేశాలు చేయాలని కోరారు. కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు గంటా కోటేశ్వరరావు, పేర్ని పృథ్వీ ఉన్నారు.

ముగిసిన ఈకేవైసీ నమోదు



ముదినేపల్లి రూరల్: రబీ పంటల ఈ–కేవైసీ ప్రక్రియ మండలంలో సోమవారంతో ముగిసింది. మండలంలోని పెదపాలపర్రు, కోడూరు గ్రామాల్లో నమోదును వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ పరిశీలించారు. మండలంలో 13 వేల ఎకరాల్లో రబీ పంటగా మినుము పైరు సాగు చేసినట్టు ఏఓ చెప్పారు. 8,176 మంది సాగు రైతుల్లో 7946 మంది ఈకేవైసీ పూర్తి చేశారని తెలిపారు. ముదినేపల్లి మండలం పెదపాలపర్రు రైతుభరోసా కేంద్రం పరిధిలోనూరుశాతం ఈకేవైసీ చేసినట్లు చెప్పారు. ఇందుకు కృషిచేసిన గ్రామ వ్యవసాయ సహాయకుడు డి.రాకేష్‌కుమార్‌ను వ్యవసాయాధికారి, స్థానిక రైతులు అభినందించారు.

పథకాలను వివరించాలి

కైకలూరు (కలిదిండి): సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు చెప్పారు. కలిదిండి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో పార్టీ మండల కన్వీనర్లు, గృహసారథులకు సమీక్ష సమావేశం సోమవారం పార్టీ మండల కన్వీనర్ తిరుమాని రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. నాయకలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య


మాట్లాడుతున్న న్యాయమూర్తి రామకృష్ణయ్య

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. గుండుపాలెం గ్రామంలో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే తమ సంస్థను ఆశ్రయిస్తే న్యాయ సహాయం అందజేస్తామన్నారు. వరకట్న వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు. న్యాయవాది చీలి మునలయ్య, సర్పంచ్ తూమాటి శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి జె. రాధాకృష్ణ, మొవ్వ వెంకయ్య, కె. హరికృష్ణబాబు పాల్గొన్నారు.

క్రీడాకారులకు డీఆర్వో అభినందన


క్రీడాకారులను సన్మానిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

చిలకలపూడి(మచిలీపట్నం): జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లాకు చెందిన క్రీడాకారులను సోమవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అభినందించారు. మధ్యప్రదేశ్‌లోని మహేశ్వరంలో జనవరి 30 నుంచి ఫిబ్రవరి 11వ తేదీ వరకు జరిగిన ఐదవ జాతీయ స్థాయి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఐదుగురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో నాగిడి గాయత్రి (సిల్వర్ మెడల్), నాగిడి భార్గవి (నాలుగో స్థానం) స్లాలమ్ డిస్ప్లేలో ఈ మెడల్స్ సాధించారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను డీఆర్వో వెంకటేశ్వర్లు దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి యు. శ్రీనివాసరావు, చీఫ్ కోచ్ కె. ఝాన్సీలక్ష్మీ, వాటర్ స్పోర్ట్స్ కోచ్ ఎం. శ్రీనివాస్, టి. నాగబాబు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం


కృత్తివెన్ను రథోత్సవంలో పాల్గొన్న అశేష భక్తజనవాహిని

కృత్తివెన్ను: మహా శివరాత్రి ఉత్సవాల్లో మూడో రోజైన సోమవారం దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామి వారి రథోత్సవం కనుల పండువగా జరిగింది. వేలాదిమంది భక్తుల జయజయ ధ్వానాల నడుమ అరటి గెలల అలంకరణతో తయారు చేసిన రథంపై దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి, రమాసహిత వీరవెంకట సత్యనారాయణ స్వామి వార్లు ఆశీనులయ్యారు. కృష్ణా జిల్లాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి హాజరైన అశేష జనవాహిని మధ్య స్వామివారి రథోత్సవం వైభవంగా సాగింది. పండితుల మంత్రోచ్ఛరణలతో పాటు వీనుల విందైన సంగీతం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. ఆలయ చైర్మన్ పట్టపు నాగేశ్వరరావు, ఈఓ సింగనపల్లి శ్రీనివాసరావు రథోత్సవాన్ని ప్రారంభించారు.

నేడు ఎమ్మెల్యే డీఎన్నార్ పర్యటన

కైకలూరు: స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) మంగళవారం నియోజకవర్గంలో పర్యటన వివరాలను ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది వెల్లడించారు. ఉదయం 9.00 గంటలకు కొల్లేటికోటలో పెద్దింటి అమ్మవారి జాతర మహోత్సవాలను ప్రారంభిస్తారు. ఉదయం 9.30 గంటలకు కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్లో కైకలూరు మండల జేసీ కన్వీనర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గ్రామ వలంటీర్లు, గృహసారథులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి మండవల్లి మండలం పుట్లచెరువు గ్రామ సచివాలయ పరిధిలో పసలపూడి, చింతలపూడి గ్రామ పంచాయతీల్లో 172 వరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు.

హుండీ కానుకల ఆదాయం రూ.3.16 లక్షలు


ఐలూరులో హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

తోట్లవల్లూరు: ఐలూరులోని శ్రీగంగాపార్వతీ సమేత శ్రీరామేశ్వరస్వామి ఆలయ హుండీని సోమవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ. 2,89,302, రఘునాయకస్వామి హుండీ ద్వారా రూ.27,384ల ఆదాయం లభించినట్లు ఆలయ మేనేజర్ జయశ్రీ తెలిపారు. ఆలయ చైర్మన్ సూర్య వరప్రసాద్, ఫెస్టివల్ ఆఫీసర్ ఫణికుమార్, దేవదాయశాఖ సిబ్బంది, గ్రామస్తుల సమక్షంలో హుండీలను లెక్కించారు.

క్రమశిక్షణతో ఉన్నత స్థానాలకు ఎదగాలి


ప్రోత్సాహకాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ

ఉంగుటూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావుఆకాంక్షించారు.తేలప్రోలులో భీమవరపు కృష్ణమోహన్‌రెడ్డి జెడ్పీ హైస్కూల్‌లో స్వర్ణశిల్పి పెట్ల సత్యనారాయణ మూర్తి, లక్ష్మీనరసమ్మ 16వ వర్ధంతి సందర్భంగా విద్యలో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను సోమవారం పంపిణీ చేశారు. ట్రస్ట్ నిర్వాహకులు పెట్ల కామేశ్వరరావు అధ్యక్షతన సర్పంచ్ లాం దిబోర, ఎంపీడీఓ శేషగిరిరావు, ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ కె.రాజశేఖర్, జాకీర్ హుస్సేన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ మహా బాషా, హెచ్ఎం సరోజిని, పూర్వ విద్యార్థులు ముత్తారెడ్డి, భానుప్రకాష్ పాల్గొన్నారు.

సమన్యాయమే లక్ష్యం

గన్నవరం: అందరికీ సమన్యాయం అందించడమే లక్ష్యమని అదనపు జూనియర్ సివిల్ జడ్జి శిరీష తెలిపారు. రాయ్‌నగర్‌లోని బాలుర వసతి గృహంలో సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి శిరీష మాట్లాడుతూ సమన్యాయం కోసం కోర్టుల ద్వారా పేద వర్గాలకు ఉచిత న్యాయ సేవలందిస్తున్నట్లు చెప్పారు. సంఘ అధ్యక్షులు అమర్తల సోమేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు వైఆర్ శారద, కార్యదర్శి రామకూరి ప్రకాశరావు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ సభ్యులు దాసరి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పామర్రు(పమిడిముక్కల): పమిడిముక్కల మండల పరిధిలోని లంకపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం 4గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పామర్రు శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ హాజరవుతారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన వలసినదిగా కోరారు.

మండవల్లి: మండలంలోని పుట్లచెరువు సచివాలయం పరిధిలో ఈ నెల 21న గడప గడపకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము) తెలిపారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రభుత్వ పథకాలు వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకుంటారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

దాడి ఘటనపై కేసు నమోదు

తోట్లవల్లూరు: చెప్పినచోట బస్సు ఆపలేదని ఆరోపిస్తూ ఆర్టీసీ డ్రైవర్‌పై వ్యక్తి దాడికి పాల్పడిన ఘటన తోట్లవల్లూరులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..స్థానిక కనకదుర్గమ్మ కాలనీకి చెందిన మహ్మద్ షబ్బీర్ అనే వ్యక్తి సోమవారం ఉదయం తోట్లవల్లూరు నుంచి ఉయ్యూరు వెళుతున్న ఆర్టీసీ బస్సులో తనతో వాగ్వాదానికి దిగి దాడి చేశాడని డ్రైవర్ గిరి శ్రీనివాసరావు పోలీసుల ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.రమేష్ తెలియజేశారు.

లబ్ధిదారులకు అవగాహన



పాములపాడు(పెదపారుపూడి): మండలంలోని పాములపాడు సచివాలయం వద్ద ఈవోపీఆర్డీ, గ్రామ ప్రత్యేకాధికారి ఎం.నాగిరెడ్డి ఇళ్ల నిర్మాణ పనుల వేగవంతంపై లబ్ధిదారులకు సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి బేస్మెంట్ పనులు ప్రారంభిస్తే వెంటనే బిల్లులు వచ్చేలా కృషి చేస్తామన్నారు. జగనన్న లేఆవుట్‌లో ఇప్పటికే తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాగర రాణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలుడి మృతి

కంకిపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ బాలుడు చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృతి చెందిన ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నెప్పల్లి గ్రామానికి చెందిన పాలపర్తి అనూష తన చిన్న కుమారుడు అభినవ్ (6)తో కలిసి ఈ నెల 16న నెప్పల్లి సెంటరులో రోడ్డు దాటుతున్నారు. ఆ సమయంలో ఉయ్యూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న వ్యాన్ ఆ బాలుడిని ఢీకొంది. ఘటనలో అభినవ్ ముఖానికి, తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడిని విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక సోమవారం అభినవ్ మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

25 నుంచి మినుము కొనుగోళ్లు


సానారుద్రవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ విద్యాసాగర్

కైకలూరు: మునుము పంటను ఈ నెల 25 నుంచి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని కైకలూరు, కలిదిండి మండల వ్యవసాయాధికారులు ఆర్.దివ్య, కె.విద్యాసాగర్ చెప్పారు. కోత దశలో ఉన్న మినుము పంటను సోమవారం వారు పరిశీలించారు. మినుము కొనుగోళ్లపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సంవత్సరానికి ప్రభుత్వం మినుము క్వింటాకు రూ.6600 కనీస మద్దతు ధరగా నిర్ణయించిందని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మినుము విక్రయించే రైతులు ముందుగా రైతు భరోసా కేంద్రాల్లో పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కై కలూరు మండలం ఆచవరం, వేమవరప్పాడు, తామరకొల్లు గ్రామాల్లో మినుము పైరు సాగు చేశారని, ప్రస్తుతం కోత దశలో మినుము ఉందన్నారు. ప్రతి రైతూ పంటను ఈ క్రాఫ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మాణిక్యాలరావు మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న కాకుమాను రాజశేఖర్ తదితరులు

గుడివాడటౌన్: సీనియర్ కాంగ్రెస్ నాయకులు మట్టా మాణిక్యాలరావు సంస్మరణ సభ సోమవారం రూరల్ మండలం లింగవరం గ్రామంలోని ఆయన స్వగృహంలో ఘనంగా జరిగింది. పలువురు రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ అధికారులు ఆయనకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపీ లిడ్క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ మాణిక్యాలరావు మృతి ఈ ప్రాంత పేద ప్రజలకు తీరని లోటని అన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సభ్యురాలు లాము తాంతియాకుమారి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషన్, రూరల్, నందివాడ మండల ఎంపీపీలు గద్దె పుష్పరాణి, పెయ్యల ఆదాం, నందివాడ ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్, రూరల్ మండల జెడ్పీటీసీ గోళ్ల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మాదాసు వెంకటలక్ష్మి, మోంద్రు వెంకటేశ్వరరావు, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ నగుళ్ల సత్యన్నారాయణ, వెంపటి సైమన్, దారం ఏడుకొండలు, మాణిక్యాలరావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు


విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి

పామర్రు: రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని ఏఎస్ఎం ప్రిన్సిపాల్ ఏ పూర్ణచంద్రారెడ్డి అన్నారు. స్థానిక యలమర్రు రోడ్డులోని ఏఎస్ఎం హైస్కూల్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులను సోమవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 19న వేమవరం కొండలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పాఠశాల విద్యార్థులు బహుమతులను, ప్రశంసాపత్రా లను సాధించారన్నారు. అండర్–14 కటా విభాగంలో జశ్వంత్ సాయినాథ్, దుండి ప్రతాప్, అభిషేక్ కుమార్, ధాత్రి చరణ్య, మమతాశ్రీ, హర్షితలు ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని పొందారన్నారు. వర్షికారెడ్డి, మణికంఠ, రాకేష్ పి.మణికంఠ ద్వితీయ స్థానంలో రజిత పతకాలను సాధించారన్నారు. పవన్‌కుమార్, మౌనిక, నిశాంత్, సుప్రియ దీక్షిత, శ్రావ్యలు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాలను పొందారు. కోచ్ వీవీఎస్ రామకృష్ణలనుప్రిన్సిపాల్, హెచ్ఎంశర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

దుర్గా మల్లేశ్వరునికి వైభవంగా పూజలు



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వర స్వామి వారి దేవస్థానంలో వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శంకరమంచి భాస్కర విజయకుమార్, బుద్దు నాగవరప్రసాద్ బ్రహ్మత్వంలో సోమవారం ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం పలువురు మహిళలు వసంతోత్సవం నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజాధిరాజ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం , రాత్రి 8 గంటలకు నిత్య బలిహారణ, రాత్రి 9 గంటలకు గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం పారువేట, శమీ వృక్షపూజ జరిగాయి. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన


సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న శేషగిరిరావు

కోడూరు: గుండెపోటు వచ్చిన సమయంలో ప్రథమ చికిత్సగా చేసే కార్డియో పల్మనరీ రిసెస్టియేషన్ (సీపీఆర్)పై రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక కోట రాఘవయ్య విద్యా సంస్థల ప్రాంగణంలో రెడ్‌క్రాస్ జిల్లా వైస్ చైర్మన్ వంగర శేషగిరిరావు విద్యార్థులకు సీపీఆర్ చేసే ప్రక్రియను వివరించారు. అత్యవసర సమయంలో సీపీఆర్ ప్రక్రియ బాధితులను రక్షించే అవకాశం ఉందని చెప్పారు. శాఖ మండల అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు, విద్యా సంస్థల గౌరవ సలహాదారు కోట వెంకట సుబ్బారావు, ప్రిన్సిపాల్ బడే కరుణ పాల్గొన్నారు.

యనమలకుదురులో ఘనంగా వసంతోత్సవం

కృష్ణానదిలో త్రిశూల స్నానం


వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

పెనమలూరు: యనమలకుదురులోని శ్రీ పార్వతి సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం ఘనంగా చేశారు. స్వామివారి కల్యాణం చేసిన మావులూరి రాజశేఖర్ దంపతులు, భక్తులు స్వామివారిని వీధుల్లో ఊరేగించారు. మహిళలు రంగులు జల్లుకుంటూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వసంతోత్సవం చేశారు. అనంతరం స్వామివారిని శివలింగాల ఘాట్ వద్ద పవిత్ర కృష్ణానదిలో త్రిశూలస్నానం చేయించారు. భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. రాత్రి ధ్వజ అవరోహణ, మూగబలి, ద్వాదశ ప్రదక్షిణలు చేశారు. స్వామివారికి పవళింపు సేవ, సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. నివేదన చేసిన నందిముద్దలను సంతానం కోసం భక్తులు అందజేశారు. నాలుగో రోజున బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

యువకుడికి తీవ్ర గాయాలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం పెరికీడు వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం తాళ్లమూడికి చెందిన కోటా మధు (29) బుల్లెట్‌పై గుడివాడ వెళ్తున్నాడు. పెరికీడు వద్ద కారు ఢీకొట్టింది. మధుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లింగ నిర్ధారణ చట్టంపై అవగాహన

నాగాయలంక(అవనిగడ్డ): మర్రిపాలెం అంగన్‌వాడీ కేంద్రం వద్ద లింగ నిర్ధారణ చట్టంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుడివాడకు చెందిన కళా భారతి కల్చరల్ బృందం నిర్వాహకులు ఎం. శేఖర్‌బాబు కళాబృందం జానపద కళారూపాల ద్వారా ప్రదర్శన నిర్వహించారు. లింగ నిర్ధారణ చేయడం నేరమని హెచ్చరించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పర్యవేక్షించారు.